


## రెండు భాగాలుగా 'దేవర'



ఎన్టీఆర్ నటిస్తున్న తాజా చిత్రం 'దేవర'కు సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కించబోతున్నట్లు దర్శకుడు కొరటాల శివ బుధవారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. 'ఎన్టీఆర్‌కు ఈ కథ చెప్పినప్పుడే చాలా ఎక్సైట్ అయ్యారు. ఓ సరికొత్త ప్రపంచంలో అత్యంత బలమైన పాత్రల నేపథ్యంలో కథ నడుస్తుంది. షూటింగ్ టైమ్‌లో ప్రతీ ఎపిసోడ్ ఓ అద్భుతంలా అనిపించింది. ఇంతటి బిగ్ కాన్వాస్ ఉన్న సినిమాను రెండు భాగాలుగా తీస్తేనే బాగుంటుందనుకున్నాం. దాంతో మా టీమ్ అందరితో చర్చించి రెండు భాగాలుగా తెరకెక్కించాలని నిర్ణయం తీసుకున్నాం. ముందుగా ప్రకటించిన విధంగా తొలి భాగాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయబోతున్నాం' అన్నారు. విస్మరణకు గురైన తీర ప్రాంత నేపథ్య కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. యువ సుధా ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి.

## ఆ ఫీలింగ్ తెచ్చే ఆనందం మామూలుగా ఉండదు

'తెలుగు సినిమాపై సీత కన్నేశారేంటి? అని ఇటీవల తాప్సీని ఓ తెలుగు అభిమాని అడిగితే – 'నేనేం చెయ్యను. సరైన అవకాశాలు రావడంలేదు. అడపాదడపా వచ్చినా కథలేమో నచ్చట్లేదు. కథలు నచ్చకపోతే సినిమాలు చేయను' అంటూ నిర్మొహమాటంగా సమాధానమిచ్చేసింది తాప్సీ. అన్నీ హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తున్నారు. కమర్షియల్ హీరోలతో మాస్ సినిమాలు చేయరా? అనడిగితే 'దీనికీ అదే నా సమాధానం. అవకాశాలు రావడంలేదు. వస్తే చేయటానికి అభ్యంతరం ఏముంటుంది? కాకపోతే నా వరకు ఆర్టిస్టుగా చిన్న సినిమాలే హాయిగా ఉన్నాయి. మీకు తెలియదనుకుంటా. నా సినిమాలకు తగ్గట్టే నా పారితోషికం కూడా ఉంటుంది. డబ్బు తక్కువ వచ్చినా అలాంటి సినిమాల్లో చేయటం వల్ల ఆత్మ సంతృప్తి ఉంటుంది. ఎందుకంటే అక్కడ అన్నీ నేనే. నా చుట్టూనే కథ తిరుగుతుంది. నాకోసమే ప్రేక్షకులు థియేటర్‌కి వస్తారు. ఈ ఫీలింగ్ తెచ్చే ఆనందం మామూలుగా ఉండదు' అంటూ తన మనసును ఆవిష్కరించింది తాప్సీ.

## మాన్షన్‌లో ఏం జరిగింది?



వరలక్ష్మీ శరత్‌కుమార్, అవికాగోర్, బిందు మాధవి, నందు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'మాన్షన్ 24'. ఓంకార్ దర్శకత్వం వహిస్తున్నారు. డిస్నీ హాట్‌స్టార్‌లో ఈ నెల 17 నుంచి స్ట్రీమింగ్ కానుంది. బుధవారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఓంకార్ మాట్లాడుతూ 'ఈ సిరీస్‌లో ఆరు ఎపిసోడ్స్ ఇంట్రెస్టింగ్‌గా సాగుతాయి. ప్రతి ఎపిసోడ్ సరికొత్త పాయింట్‌తో ఆకట్టుకుంటుంది. ఫ్యామిలీ అంతా చూసేలా ఉంటుంది' అన్నారు. వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'హారర్ థ్రిల్లర్ కథాంశమిది. నా క్యారెక్టర్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుంది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న సిరీస్‌లో భాగం కావడం ఆనందంగా ఉంది' అని చెప్పింది.

**డ్రగ్స్ కేసుతో సంబంధం లేదు**

ఇదే కార్యక్రమంలో తనపై వచ్చిన డ్రగ్స్ కేసు గురించి మాట్లాడింది వరలక్ష్మీ శరత్‌కుమార్. మాదక ద్రవ్యాల కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ నుంచి తనకు నోటీసులు అందాయన్న ప్రచారంలో వాస్తవం లేదని వరలక్ష్మీ శరత్‌కుమార్ స్పష్టం చేసింది. 'గతంలో ఆదిలింగం అనే వ్యక్తి నా దగ్గర ఫ్రీలాన్స్ మేనేజర్‌గా పనిచేశారు. ఆయన తీసుకొచ్చిన నాలుగు చిత్రాల్లో నటించా. అంతేకానీ అతని వ్యక్తిగత జీవితం గురించి నాకు ఏమీ తెలియదు. డ్రగ్స్ కేసులో ఆయన ఉన్నారంటూ వార్తలొచ్చాయి. దాంతో కొందరు నా ఫొటోను వాడుకొని కథనాలు రాశారు. అంతేతప్ప డ్రగ్స్ కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు' అని వరలక్ష్మీ శరత్‌కుమార్ పేర్కొంది. 'మాన్షన్ 24' సిరీస్‌కు సంగీతం: వికాస్ బాడిస, నిర్మాతలు: ఓంకార్, అశ్విన్ బాబు, కల్యాణ్ చక్రవర్తి.



శ్రీలీల, బాలకృష్ణ

## మస్తుగా ఉరుకుతాంది

'ఉడతా ఉడతా హుష్షా హుష్.. సప్పుడు సేయకుర్రీ.. నీ కన్నా మస్తుగ ఉరుకుతాంది మా సిట్టి సిన్నారీ..'. పాట అదిరింది కదూ. బాలకృష్ణ 'భగవంత్ కేసరి' సినిమా కోసం తెలంగాణ భాష, యాసలోని సోయగమంతా వినిపించేలా అనంతశ్రీరామ్ రాసిన పాట ఇది. తమన్ స్వరాలందించగా, యస్.పి.చరణ్ ఆలపించారు. ఈ పాటను బుధవారం విడుదల చేశారు. చిత్రీకరణ చూస్తుంటే 34ఏళ్ల క్రితం బాలకృష్ణ 'ముద్దులమావయ్య' సినిమాలోని 'మామయ్య అన్న పిలుపు.. మా ఇంట ముద్దులకు పొద్దుపొడుపు' పాట గుర్తొస్తున్నది. కాకపోతే చిన్న మార్పు.. అక్కడ చెల్లెలు, ఇక్కడ కూతురు అంతే తేడా. బాలయ్య బాబాయిగా, శ్రీలీల కూతురుగా ఒదిగిపోయి నటించారీ పాటలో. ఈ పాటను బట్టి సినిమాలో ఎమోషన్స్‌కి కొదవుండదని అర్థమవుతున్నది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, హరీశ్ పెద్ది నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానున్న విషయం తెలిసిందే.

## ఊహలకు అందని రీతిలో ఉంటుంది



సుధీర్‌బాబు

' ఓ పెద్దాయన జీవితంలోని సంఘటనల సమాహారం ఈ సినిమా. అనుకోకుండా అతని జీవితంలోకి ఇద్దరు వ్యక్తులు వస్తారు. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది ఈ సినిమా కథ. ఆ ముగ్గురూ నేనే' అని సుధీర్‌బాబు చెప్పారు. రచయిత హర్షవర్ధన్ దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన చిత్రం 'మామా మశ్చీంద్ర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మాతలు. అక్టోబర్ 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు విలేకరులతో ముచ్చటించారు. 'కంటెంట్ ఉన్న కమర్షియల్ సినిమా ఇది. ఓ విధంగా నటుడిగా నాకిది సాహసమే. పొంతన లేని మూడు రకాల పాత్రలు ఇందులో చేశాను. ఈ పాత్రలు చేయడానికి శారీరకంగా, మానసికంగా చాలా కష్టపడ్డాను. ఒక పాత్రలో వృద్ధుడిగా కనిపిస్తా. ఒక పాత్రలో లావుగా కనిపిస్తా. మూడో పాత్రలో నాలా నేనుంటా. వీటి మేకప్ కోసం ప్రోస్తటిక్ వాడాం. చాలా శ్రద్ధ తీసుకున్నాం. ఎబ్బెట్టుగా ఉండకుండా జాగ్రత్తపడ్డాం. లావుగా ఉండే పాత్ర మేకప్ విషయంలో కాస్త ఇబ్బంది పడాల్సివచ్చింది' అని చెప్పారు సుధీర్‌బాబు. ఇంకా చెబుతూ 'దర్శకుడు హర్షవర్ధన్ ఈ కథ చెప్పినప్పుడు ఆశ్చర్యానికి లోనయ్యాను. ఊహలకు అందని రీతిలో ఉంటుందీ సినిమా. నా పాత్రల విషయంలో చాలా రీసెర్చ్ చేశాను. కథానాయికలు ఇషా రెబ్బా, మృణాళిని పాత్రలు కూడా ఆకట్టుకుంటాయి' అన్నారు. ' కృష్ణగారి బయోపిక్‌లో నటిస్తారా? అనడిగితే –'అవకాశం వస్తే తప్పకుండా చేస్తా. చేయలగను కూడా. అల్లుడిగా చెప్పట్లేదు. అభిమానిగా చెపుతున్నా' అని మనసులోమాట బయటపెట్టారు సుధీర్‌బాబు.



ఎస్తర్

## అదే అసలైన శిక్ష

ఎస్తర్, శృతి శరణ్, అవయుక్త, వంశీ పాండ్య ప్రధానపాత్రధారులుగా, చంటి గానమని దర్శకత్వంలో వెంకటేశ్ చిక్కాల నిర్మిస్తున్న 'లేతాకులు' చిత్రం షూటింగ్ బుధవారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి వకుళాభరణం కృష్ణమోహన్‌రావు క్లాప్ ఇవ్వగా, మోహన్ వడ్లపట్ల కెమెరా స్విచాన్ చేశారు. తమ్ముడు సత్యం స్క్రిప్ట్ అందించగా, వి.వి.సముద్ర గౌరవ దర్శకత్వం వహించారు. ఇండియన్ హిస్టరీలో ఇలాంటి కాన్సెప్ట్ రాలేదని, ముఖ్యంగా మహిళలకు బాగా నచ్చే కథ ఇదని, ఎస్తర్ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని, దసరా తర్వాత రెగ్యులర్ షూటింగ్ మొదలు పెడతామని నిర్మాత చెప్పారు. మనల్ని ఎవరైనా బాధపడితే, మనం పడిన బాధ వాళ్లకు కూడా కలిగేలా చేయడం అసలైన శిక్ష. ఈ నేపథ్యంలో కథ ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు కెమెరా: మురళీమోహన్‌రెడ్డి, సంగీతం: సుక్కు.

## పాటలో ఇబ్బంది పడ్డా!



కిరణ్ అబ్బవరం

'ఇందులో నా పాత్ర ప్రత్యేకంగా ఉంటుంది. అమ్మ పెట్టే రూల్స్ మధ్య పెరగడంవల్ల ప్రథమార్ధంలో బుద్ధిమంతుడైన విద్యార్థిగా కనిపిస్తా. ద్వితీయార్థంలో ఉద్యోగస్తుడిగా కనిపిస్తా. ఇక్కడ నా రూల్స్ వల్ల తోటి ఎంప్లాయిస్ సఫరవుతుంటారన్నమాట' అని తన పాత్ర గురించి చెప్పుకొచ్చారు కిరణ్ అబ్బవరం. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'రూల్స్ రంజన్'. రత్నం కృష్ణ దర్శకుడు. ఏ.ఎం.రత్నం సమర్పిస్తున్న ఈ సినిమా ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం విలేకరులతో ముచ్చటించాడు. ఇంకా చెబుతూ –'అవుట్ అండ్ అవుట్ కామెడీ సినిమా ఇది. ప్రథమార్ధం అంతా నవ్వులు. ద్వితీయార్థం మొత్తం ఎమోషన్స్' అని చెప్పారు కిరణ్ అబ్బవరం. 'కథానాయిక నేహాశర్మ పాత్ర కథలో చాలా కీలకం. మాఇద్దరి కెమిస్ట్రీ బాగా వర్కవుటయింది. కాకపోతే ఇందులో ఓ రొమాంటిక్ సాంగ్ ఉంటుంది. ఆ పాటలో నటించడానికి కాస్త ఇబ్బందిపడ్డాను. ఇలాంటి పాటల్లో నటించడానికి మా సీనియర్ హీరోలు ఎంత ఇబ్బందిపడేవారో అర్థమైంది. కథను నమ్మి ఈ సినిమా చేశాను. దర్శకుడు రత్నంకృష్ణ పూర్తి క్లారిటీతో సినిమా తెరకెక్కించారు' అని కిరణ్ అన్నారు.

## ఓ తండ్రి కథ



బాధ్యతారాహిత్యంగా పెరిగిన కొడుకు సమాజానికి కీడుగా మారితే, ఆ తండ్రి ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు? ఆ తండ్రీకొడుకుల మధ్య జరిగే సంఘర్షణ ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానంగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. శాంతిచంద్ర, దీపికా సింగ్, సిమ్రితి ప్రధానపాత్రధారులు. ఆడారి మూర్తిసాయి దర్శకుడు. జి.ఎస్.బాబు నిర్మాత. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి హీరో శ్రీకాంత్, దర్శకుడు వీరశంకర్ అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. సినిమా పేరు నెగెటివ్‌గా ఉన్నా, సమాజానికి మంచి సందేశం ఇచ్చే సినిమా ఇదని, పిల్లల్ని బాధ్యతగా తల్లిదండ్రులు, గురువులు తీర్చిదిద్దకపోతే.. సమాజానికి ఎలాంటి నష్టం వాటిల్లుతుందో ఈ సినిమా చెబుతుందని హీరో శాంతిచంద్ర చెప్పారు.

## సస్పెన్స్ థ్రిల్లర్ 'తంతిరం'



శ్రీకాంత్ గుర్రం, ప్రియాంకశర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'తంతిరం'. ముత్యాల మెహర్ దీపక్ దర్శకత్వం వహించారు. సినిమా బండి పతాకంపై శ్రీకాంత్ కంద్రుగుల నిర్మించారు. ఈ నెల 13న విడుదల కానుంది. సోమవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కూడుకున్న కథ ఇది. ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. కథలోని మలుపులు ఆశ్చర్యానికి గురిచేస్తాయి' అన్నారు. అద్భుతమైన విజువల్స్‌తో ఈ సినిమా ఆకట్టుకుంటుందని నిర్మాత తెలిపారు.





